అటు వ్యర్థాలు...ఇటు బండరాళ్లు

- ప్రభుత్వ స్థలంలో ఆక్రమణల పర్వం
- అక్రమంగా దుకాణాలు...గుడిసెల ఏర్పాటు



హఫీజ్‌పేట్ సర్వే నంబర్ 69లో వ్యర్థాలు, బండరాళ్లు వేసిన దృశ్యం



సర్వే నంబర్ 69లో ప్రభుత్వ భూమి అంటూ బోర్డు పెట్టిన దృశ్యం

హఫీజ్‌పేట్ : శేరిలింగంపల్లి మండలంలోని హఫీజ్‌పేట్ గ్రామ పరిధిలోని ప్రభుత్వ భూమిలో అక్రమంగా కొంతమంది వ్యర్థాలు, బండరాళ్ళు వేస్తున్నారు. కోట్లు విలువ చేసే ప్రభుత్వ భూమిపై కన్నుపడింది. హఫీజ్‌పేట్ గ్రామ సర్వే నంబర్ 69లో 3.29 ఎకరాలు ప్రభుత్వ భూమి ఉంది. కొంతభూమి ఆక్రమణదారుల బారినపడగా ఇప్పుడు ఎకరన్నర ప్రభుత్వ భూమి మిగిలింది. ఆ మిగిలిన ప్రభుత్వ స్థలంలో కూడా పెద్ద బండరాళ్ళు, వ్యర్థాలు తరలించి పోస్తున్నారు. ఇటీవల కొంత కాలం క్రింద ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైందని మండల తహసీల్దార్‌కు స్థానికులు ఫిర్యాదు చేయగా వెంటనే రెవెన్యూ అధికారులు వచ్చి ప్రభుత్వ భూమి చుట్టు వేసిన ఇనుప రేకులను తొలగించారు. కాగా ఇక్కడ పక్కనే ఉన్న ప్రైవేట్ భవన నిర్మాణ సంస్థకు చెందిన కూలీలు గుడిసెలు వేసుకున్నారు. దీంతో మరి కొంతమంది ఏకంగా ప్రభుత్వ భూమి చుట్టూ దుకాణాలు ఏర్పాటు చేసుకొని వ్యాపారం చేస్తున్నారు. శేరిలింగంపల్లి మండల తహసీల్దార్ చర్యలు తీసుకోవాలని హఫీజ్‌పేట్ గ్రామస్తులు కోరుతున్నారు.

ప్రభుత్వ భూమి బోర్డు పెట్టినా...

హఫీజ్‌పేట్ సర్వే నంబర్ 69 ప్రభుత్వ భూమిలో ఉన్న ఎకరన్నర భూమిపై కబ్జాదారుల కన్నుపడింది. హైటెక్ సమీపంలో ఉన్న ఈ ప్రభుత్వ భూమి కోట్లు విలువ చేస్తుంది. దీన్నే అదునుగా చేసుకున్న కబ్జాదారులు నెమ్మదిగా మట్టిపోస్తున్నారు. శేరిలింగంపల్లి రెవెన్యూ అధికారుల అండదండలతోనే ఇదంతా జరుగుతుందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలి



హఫీజ్‌పేట్ సర్వే నంబర్ 69లోని ప్రభుత్వ భూమి రోజు రోజుకు కబ్జారాయుళ్ళ చేతిలోకి వెళ్తుంది. ప్రభుత్వ స్థలం చుట్టు ఫెన్సింగ్ వేయాలి. కోట్లు విలువ చేసే భూమిపై కొందరి కన్ను పడింది. ఇప్పటికైన రెవెన్యూ అధికారులు ప్రభుత్వ భూమిలో వెలసిన దుకాణాలను తొలగించాలి.

–గౌస్, హఫీజ్‌పేట్

బండరాళ్లను తొలగించాలి



ప్రభుత్వ స్థలంలో అక్రమంగా వేస్తున్న వ్యర్థాలను, బండరాళ్ళను రెవెన్యూ అధికారులు తక్షణమే తొలగించాలి. బండరాళ్ళు వేసిన వారిపై చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వ భూమిని పేద ప్రజల అవసరాలకు వినియోగించాలి.

–అనంత్, హఫీజ్‌పేట్

పీఎస్‌ను సందర్శించిన చిన్నారులు



గచ్చిబౌలి పీఎస్‌ను సందర్శించిన హాలు కిడ్స్ స్కూల్ చిన్నారులు

గచ్చిబౌలి: హాలు కిడ్స్ స్కూల్ విద్యార్థులు శనివారం గచ్చిబౌలి పీఎస్‌ను సందర్శించారు. రిసెప్షన్‌తో పాటు విజిటర్స్ ఏరియా, ఎస్‌హెచ్‌ఓ రూమ్, లాకప్‌ను చూశారు. పోలీస్‌స్టేషన్ గురించి ఉపాధ్యాయులు చిన్నారులకు వివరించారు. సాధారణ విజిటర్స్‌తో పాటు చిన్నారులు రావడంతో పీఎస్ సందడిగా మారింది.

సీసీ రోడ్డు పనుల పరిశీలన



సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ శ్రీకాంత్ తదితరులు

మియాపూర్ : అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలని కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ పేర్కొన్నారు. మియాపూర్‌లోని డీకే ఎన్‌క్లేవ్‌లో చేపట్టిన సీసీ రోడ్డు పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పనులను నిర్ణీత కాలవ్యవధిలో పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు, కాంట్రాక్టర్‌లకు సూచించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు రాంబాబు, విజయ్, సుధాకర్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సృజన కిడ్స్ స్పోర్ట్స్ డే



చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి హుడా ట్రేడ్ సెంటర్ కాలనీలోని సృజన కిడ్స్ స్కూల్ స్పోర్ట్స్ డేను శనివారం ఘనంగా నిర్వహించారు. స్కూల్ ఛైర్మన్ వీర రాఘవులు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం చిన్నారులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ కవిత తదితరులు పాల్గొన్నారు.

కుట్టుమిషన్లు పంపిణీ



కుట్టుమిషన్లను పంపిణీ చేస్తున్న కొండ విజయ్‌కుమార్ తదితరులు

హఫీజ్‌పేట్ : లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్, హోప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం చందానగర్ హుడాకాలనీలో రెండు కుటుంబాలకు కుట్టుమిషన్లను కొండ విజయ్ కుమార్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ .కార్యక్రమంలో లయన్స్ సభ్యులు దొంతి లక్ష్మి నారాయణగౌడ్, కరుణాకర్‌గౌడ్, జనార్దన్‌రెడ్డి, వినయ్‌కుమార్‌గౌడ్, శంకర్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్ల ఆందోళన



నిరసన తెలుపుతున్న ఆటో డ్రైవర్‌లు

జిన్నారం(పటాన్‌చెరు): గుమ్మడిదల మండలంలోని కానుకుంట గ్రామంలో ఆటోడ్రైవర్‌లు శనివారం నిరసన తెలిపారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం ఉండటంతో తమకు గిరాకీలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరారు.

అన్నమయ్య స్వరార్చన



మాదాపూర్: మాదాపూర్‌లోని అన్నమయ్యపురంలో శనివారం నిర్వహించే అన్నమయ్య స్వరార్చన కార్యక్రమంలో భాగంగా సరస్వతి సంగీత శిక్షణాలయం విద్యార్థులు స్వరార్చనతో సందర్శకులను అలరించారు. గురువు ఎస్. సరస్వతి శిష్యబృందం అన్నమయ్య కీర్తనలు గణనాయకం, ఆదిమూలమే, తిరుమల గిరిరాయ, నారాయణ, జయలక్ష్మి , వరలక్ష్మీ, ఇతడే పరబ్రహ్మ తదితరాలు ఆలపించారు. వీరికి వయోలిన్ షణ్ముఖశర్మ, మృదంగం మల్లికార్జున శర్మ వాయిద్య సహకారం అందించారు. అనంతరం కళాకారులను జ్ఞాపికలతో సత్కరించారు.

ఆకట్టుకుంటున్న ఆలిండియా క్రాఫ్ట్ మేళా

- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

మాదాపూర్: శిల్పారామంలో ఏర్పాటు చేసిన ఆలిండియా క్రాఫ్ట్‌మేళా సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటుంది. శనివారం సెలవురోజు కావడంతో సందర్శకుల సందడి నెలకొంది. చేనేత ఉత్పత్తులను కొనుగోలు చేశారు. సౌత్‌జోన్ కల్చరల్ సెంటర్ తంజావూర్ స్పాన్సర్ చేసిన గారడీ గొంబే, బుట్టబొమ్మలు, సూర్యప్రకాశ్ బృందం నృత్యం, త్రిప్తి నగర్ ఉజ్జయిని కళాకారులు జానపద నృత్యంతో అలరించారు. అలాగే సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా కాత్యాయిని శిష్యబృందం భరతనాట్య ప్రదర్శనతో సందర్శకులను అలరించారు.



మంజూరైన పనులను వెంటనే ప్రారంభించండి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): భారతినగర్ డివిజన్ పరిధిలో మంజూరైన అభివృద్ధి పనులను వెంటనే ప్రారంభించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ వెన్నవరం సింధు ఆదర్శ్‌రెడ్డి కోరారు. శనివారం భారతినగర్ డివిజన్ పరిధిలోని వార్డు కార్యాలయంలో వార్డు సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎంఐజీ, ఎల్ఐజీ కాలనీలలో మంజూరైన రోడ్లను త్వరగా ప్రారంభించాలని సూచించారు. పలుచోట్ల నూతనంగా ఏర్పాటుచేసిన విద్యుత్ స్తంభాలకు లైట్లను ఏర్పాటు చేయాలని, ఎప్పటికప్పుడు రోడ్లను శుభ్రం చేయాలని పారిశుధ్య సిబ్బందికి సూచించారు. అధికారులు నిత్యం క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు.

ఎల్లమ్మ చెరువు అభివృద్ధి పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ తదితరులు

భాగ్యనగర్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని ఎల్లమ్మ చెరువు అభివృద్ధి పనులు, చెరువులో మురుగునీరు కలవకుండా చేపడుతున్న పైపులైను నిర్మాణ పనులకు శనివారం శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, స్థానిక కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ ఎల్లమ్మ చెరువు సుందరీకరణ పనులను 2 కోట్ల 74 లక్షల రూపాయల వ్యయంతో చేపట్టినట్లు తెలిపారు. పనుల్లో నాణ్యత పాటించాలని ఆదేశించారు . చెరువు చుట్టూ కంచె చేపడతామన్నారు. చెరువులను సంరక్షించడమే ధ్యేయంగా పనిచేస్తున్నామని తెలిపారు.

హైటెక్స్‌లో టెక్ ఎక్స్‌పో- 2023 ప్రారంభం

మాదాపూర్: విద్యార్థులను పోటీ పరీక్షలకు సిద్ధం చేయడంలో టుటోరాక్ అకాడమీ ముందుంటుందని వ్యవస్థాపకుడు డాక్టర్ మల్లికార్జున్ తెలిపారు. మాదాపూర్‌లోని హైటెక్స్‌లో రెండురోజుల పాటు నిర్వహించనున్న 4వ ఎడిషన్ ఈటీ టెక్ఎక్స్ (ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ రిసోర్సెస్ టెక్ ఎక్స్‌పో 2023)ను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అకాడమీ స్కూల్ అడ్వాన్స్‌మెంట్ ప్రోగ్రాం ద్వారా 3I1, 3I2 తరగతులకు ఇంటిగ్రేటెడ్ లెర్నింగ్ అనుభవం అందిస్తుందన్నారు. జేఈఈ, నీట్ వంటి ప్రతిష్టాత్మకమైన పోటీ పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేయడంపై దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు.

పాఠశాలలోనే సరైన పునాది వేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ సుశీందర్‌రావు

రంగారెడ్డి జిల్లా విద్యాశాఖాధికారి సుశీందర్‌రావు

రాయదుర్గం: విద్యార్థుల సమగ్ర వికాసానికి ప్రభుత్వ పాఠశాలల్లోనే సరైన పునాదులు పడతాయని రంగారెడ్డి జిల్లా విద్యాశాఖాధికారి సుశీందర్‌రావు అన్నారు. శేరిలింగంపల్లి మండలం రాయదుర్గంలోని ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో జరిగిన విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశంలో ఆయన శనివారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లల కోసం నిత్యం ఓ గంట సమయం విధిగా కేటాయించాలని ఆయన సూచించారు. పిల్లలు సరైన మార్గంలో ఉన్నారా....? లేదా...? అని తెలుసుకుంటుండాలని, ఎప్పటికప్పుడు చదువులో వారి ప్రగతిని అంచనా వేయాలని సూచించారు. వచ్చే విద్యా సంవత్సరానికి నూతన పాఠశాల భవనాలన్నీ అందుబాటులోకి వస్తాయన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తాజ్‌బాబు మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థుల అవసరాలకు తగినట్లుగా మౌలిక వసతులు కల్పిస్తున్నారన్నారు. ఒకటి నుంచి అయిదవ తరగతి వరకు సాధించాల్సిన బోధనా లక్ష్యాలను విజయవంతంగా సాధించడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో ప్రాథమిక, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మంచి ఫలితాలు సాధించాలి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): మంచి ఫలితాలు సాధించే దిశగా ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం తెల్లాపూర్‌లోని జిల్లా పరిషత్ పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో నిర్వహించిన తల్లిదండ్రుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లలను గమనిస్తూ ఉండాలన్నారు. పిల్లలు ఎలా చదువుతున్నారనే విషయాలను గమనించాలన్నారు. ఉపాధ్యాయుల విద్యాబోధనను పరిశీలించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు భాస్కర్, ఉపాధ్యాయులు హరిశంకర్, రేణుక, ఇందిరా దేవి, రజిత, సమీనా, లలిత, మాధవి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

టీహబ్ స్టార్టప్ ‘ఛోటు’ ప్రారంభం



‘ఛోటు’ క్యూఆర్ కోడ్‌ను ప్రారంభిస్తున్న సీఈఓ శ్రీనివాసరావు ,నిర్వాహకులు

రాయదుర్గం: వినూత్న ఆలోచనలున్న యువతను ప్రోత్సహించడమే టీహబ్ లక్ష్యంగా పనిచేస్తుందని సీఈఓ ఎం శ్రీనివాసరావు స్పష్టం చేశారు. హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని టీహబ్ ప్రాంగణంలో శనివారం టీహబ్ స్టార్టప్ ‘ఛోటు’ క్యూఆర్ కోడ్‌ను లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భారతదేశంలో 1.3 కోట్ల కిరాణాషాప్‌లు ఉన్నాయని, మిగతా రకాల షాపులు జతపరిస్తే, ఆ సంఖ్య భారీగా ఉంటుందన్నారు. యూపీఐతో చెల్లింపులు చాలా సులువుగా సాగుతున్నాయని, కానీ ఇంకా ఈ కామర్స్ లోకల్‌షాప్‌లు అందుబాటులోకి రాలేదన్నారు. ఛోటు ఈ వ్యత్యాసాన్ని తగ్గించగలదని భావిస్తున్నామన్నారు. ‘ఛోటు’ స్టార్టప్ సహ వ్యవస్థాపకుడు వై రవి మాట్లాడుతూ ఛోటు స్టార్టప్‌తో ప్రతి లోకల్‌షాప్‌ని ఆన్‌లైన్ చేయడమే తమ లక్ష్యం అని అన్నారు. మరో సహ వ్యవస్థాపకుడు వంశీ పంజాల మాట్లాడుతూ పాన్ ఇండియా సినిమాలకు హైదరాబాద్ పుట్టినిల్లు అని, తాము ముందుగా తెలుగు రాష్ట్రాలలో దీన్ని ప్రారంభిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో టీహబ్ చీఫ్ డిజిటల్ ఆఫీసర్ వింగ్ కమాండర్ ఆంథోని అనీష్, తెలంగాణ స్టేట్ ఇన్నోవేషన్ సెల్ చీఫ్ ఇన్నోవేషన్ ఆఫీసర్ డాక్టర్ శాంతతౌతం, ఛోటు స్టార్టప్ ప్రతినిధులు పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం

మియాపూర్: ఓ యువకుడు ఉద్యోగం ఇంటర్వ్యూకు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వెళ్లి.. ఇంటికి తిరిగిరాని సంఘటన మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ జగదీష్ తెలిపిన వివరాల ప్రకారం మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోనీ డాల్ఫిన్ దుర్గా కౌంటీ 216 లో నివాసం ఉంటున్న పవన్ కళ్యాణ్ (25) ఈ నెల 14న ఉదయం 10 గంటలకు ఉద్యోగం ఇంటర్వ్యూ ఉందని ఇంట్లో చెప్పి వెళ్ళాడు. రాత్రి అయినా పవన్ ఇంటికి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు చుట్టు పక్కల, బంధువులు, స్నేహితులు ఇళ్లలో ఎంత వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో ఆందోళన చెందిన పవన్ బావ అనుదీప్ కుమార్ మియాపూర్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఇంతకు ముందు మార్చి నెలలోనూ ఇలాగే ఇంట్లో చెప్పాపెట్టకుండా వెళ్లి మళ్లీ కొద్ది రోజులకు తిరిగి వచ్చాడని కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ మేరకు మియాపూర్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

నేడు ఉద్యోగ మేళా

జిన్నారం(పటాన్‌చెరు): ఎంఎస్ఎన్ పరిశ్రమల్లోని వివిధ యూనిట్లలో ఆదివారం ఉద్యోగ మేళాను నిర్వహిస్తున్నట్లు పరిశ్రమ ప్రతినిధి సతీష్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ జిన్నారం, గుమ్మడిదల మండలాల్లోని ఎంఎస్ఎన్ పరిశ్రమల్లోని ఆయా యూనిట్లలో వివిధ రకాల పోస్టులను భర్తీ చేసేందుకు ఆదివారం ఉద్యోగ మేళాను నిర్వహిస్తున్నామన్నారు. బొంతపల్లిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉదయం 10 గంటలకు ఇంటర్వ్యూలను నిర్వహిస్తున్నామన్నారు. ఇంటర్, డిగ్రీ చదివిన యువతీ, యువకులు అర్హులన్నారు.

కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో..టమాట 25, పచ్చిమిర్చి 40-50 , బెండ 60, కాకర 60, దొండ 70, దోస 40, ఆలు 25, చామ 50, కీర 25, బీర 70, వంకాయ 60, గోకర 60, బీన్స్ 60.

ఉరి వేసుకుని యువకుడి ఆత్మహత్య

మియాపూర్: ఓ యువకుడు లాడ్జిలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ జగదీష్ తెలిపిన వివరాల ప్రకారం ఏపీలోని వెస్ట్ గోదావరి జిల్లాకు చెందిన ఎం.వెంకటేశ్వరరావు కుమారుడు లక్ష్మీ నరసింహమూర్తి కేపీహెచ్‌బీ కాలనీలో స్నేహితులతో కలిసి ఉంటూ స్థానికంగా బజాజ్ ఫైనాన్స్ కంపెనీలో పనిచేస్తున్నాడు. లక్ష్మీ నరసింహమూర్తి గురువారం సాయంత్రం మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోనీ డీఎస్ఆర్ లాడ్జిలో అద్దెకు తీసుకొని 202 రూమ్‌లో ఉన్నాడు. 24 గంటలైనా ఆయన రూమ్ నుంచి బయటికి రాకపోవడంతో లాడ్జి సిబ్బంది శుక్రవారం రాత్రి రూమ్ తలుపు తెరిచి చూడగా ఫ్యాన్‌కు ఉరి వేసుకుని వేలాడుతూ కనిపించాడు. వెంటనే మియాపూర్ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడి బావ కిషోర్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మియాపూర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. లక్ష్మీనరసింమూర్తికి నెలరోజుల క్రితం వివాహ నిశ్చితార్థం అయింది. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

మహిళ అదృశ్యం

పటాన్‌చెరు టౌన్: డ్యూటీకి వెళ్తున్నానని చెప్పి వెళ్లిన మహిళ అదృశ్యమైన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది.హెడ్ కానిస్టేబుల్ వీరమణి కథనం ప్రకారం.. పట్టణంలోని గోకుల్‌నగర్‌కు చెందిన మాధురి ప్రైవేట్ కంపెనీ ఉద్యోగి. రోజు మాదిరిగానే ఈ నెల 14వ తేదీన డ్యూటీకి వెళ్లిన మాధురి తిరిగి ఇంటికి రాలేదు. దీంతో భర్త మధు ఫోన్ చేయగా నా కోసం వెతకవద్దు అని మెసేజ్ పెట్టింది. భార్య కోసం మధు స్థానికంగా, తెలిసిన వారి వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. భార్య అదృశ్యంపై శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మహాపడి పూజ

హఫీజ్‌పేట్ : డివిజన్ పరిధిలోని హఫీజ్‌పేట్ గ్రామంలో శనివారం శ్రీ అయ్యప్పస్వామి మహాపడి పూజ ఘనంగా జరిగింది. ఈ పూజకు ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ హాజరై స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గౌతమ్‌గౌడ్, వెంకటేష్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

భెల్‌లో సంత ప్రారంభం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): బీహెచ్‌ఈఎల్ కాలనీలో కొన్నేళ్లుగా మూసివేసిన శనివారం సంతను భెల్ యాజమాన్యం తిరిగి ప్రారంభించింది. దీంతో కూరగాయల వ్యాపారులు, స్థానిక ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. బీహెచ్‌ఈఎల్ కాలనీలో స్థానికుల కోసం బుధ, శనివారం సంతలను ఏర్పాటు చేసింది. అందుకోసం రెండు ప్రాంతాల్లో షెడ్లు, తాగునీటి సౌకర్యం కల్పించారు.



శనివారం సంత కోసం వేసిన షెడ్లు



ఎమ్మెల్యే గాంధీని సత్కరించిన సంఘం ప్రతినిధులు

ఎమ్మెల్యేకు సన్మానం

గచ్చిబౌలి: రాబోయే ఐదేళ్ళపాటు మరింత బాధ్యతాయుతంగా పనిచేస్తామని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు.శనివారం శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్య అసోసియేషన్ సభ్యులు గాంధీని ఆయన నివాసంలో కలిసి సన్మానించారు. అనంతరం వారిని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ సమస్యలను పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో శేరిలింగంపల్లి ప్రైవేటు పాఠశాల యాజమాన్య అసోసియేషన్ సభ్యులు బొరుసు వెంకటేశ్వరరావు, బందా నరేంద్రబాబు, గాయం భీష్మారెడ్డి, ఎస్ రాజేశ్వరరావు, అస్లామ్, నోవా, ప్రద్యుమ్న, దొడ్డ విజయ్, స్వామి దాస్, రత్నకుమారి ఇతర సభ్యులు పాల్గొన్నారు.


అర్హులకు సంక్షేమ పథకాలు అందేలా చూడాలి



బూత్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న జగదీశ్వర్‌గౌడ్

మియాపూర్ : అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందేలా చూడాలని కాంగ్రెస్ పార్టీ శేరిలింగంపల్లి ఇన్‌చార్జి వి. జగదీశ్వర్‌గౌడ్ పేర్కొన్నారు. శనివారం మియాపూర్‌లోని పార్టీ కార్యాలయంలో బూత్ కమిటీ సభ్యుల సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఎలాంటి సమస్యలు తలెత్తినా తమ దృష్టికి తీసుకురావాలని , వెంటనే పరిష్కారానికి కృషిచేస్తానన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు సంక్షేమ పథకాలను ఇంటింటికీ చేరవేయాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఇలియా షరీఫ్, కృష్ణ, మియాపూర్ డివిజన్ అధ్యక్షులు శ్రవణ్, నాయకులు సాంబశివరావు, ఆసీఫ్, నరేందర్ ముదిరాజ్, సమీర్, షరీఫ్, మహమద్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నాణ్యత పాటించాలి



జై భారత్‌నగర్‌లో సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు

భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని జై భారత్‌నగర్‌లో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను శనివారం హైదర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీసీ రోడ్ల వంటి అభివృద్ధి పనులను నాణ్యత పాటించాలన్నారు. కాలనీలో, బస్తీలో ఏవైనా సమస్యలు ఉంటే నేరుగా తన దృష్టికి తీసుకువస్తే అధికారులతో సంప్రదించి త్వరగా పరిష్కరిస్తానని పేర్కొన్నారు. వర్క్ ఇన్‌స్పెక్టర్ మహదేవ్, దేవి, డ్రైనేజీ సూపర్‌వైజర్ నరేందర్, కాలనీవాసులు కుమారస్వామి, ప్రభాకర్, శివరామకృష్ణ, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.